

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

- 50 ఏళ్ల పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ రికార్డు
- వ్యవసాయ వర్సిటీకి ఆచార్య పేరు ఘనత మాదే
- జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'స్వాతంత్ర్య పోరాటంలో వెనకబడి పోతామనే కారణంతో రంగా దంపతులు పిల్లలనే వద్దనుకున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఆయన జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్జీ రంగా గురించి తెలుపుతూ ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయన్నారు. శుక్రవారం ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని లాంఫారంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. తొలుత రంగా కుటుంబసభ్యులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో సీఎం ఉపన్యసించారు. వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన రోజునే రంగా 125వ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో వ్యవసాయ యూనివర్సిటీకి, విభజన తర్వాత నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకి ఎన్జీ రంగా పేరు (మిగతా 6వ పేజీలో)

రంగానే నాకు స్ఫూర్తి

రైతు గౌరవమే దేశ గౌరవం. రైతు సంక్షేమమే దేశాభివృద్ధి.. అని ఎన్జీ రంగా చెబుతుండేవారు. పార్లమెంట్ లోపల, బయట ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. అవన్నీ నాపై ప్రభావం చూపించాయి. రూరల్ డెవలప్‌మెంట్‌పై పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు ఆయన రచనలు, అధ్యయనాలే నాలో స్ఫూర్తిని నింపాయి.

\- సీఎం చంద్రబాబు



ఎన్జీ రంగా జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

ఈకేవైసీ పెండింగ్

- గడువు ముగిసినా 2.76 లక్షల కార్మికుల ఈకేవైసీ పెండింగ్
- పూర్తయిన వారికే పని, వేతనం
- అమలులో జాప్యం..అవగాహన కల్పనలో నిర్లక్ష్యం

'ఉపాధి'లో బోగస్ హాజరు నిరోధానికి ఎన్ఎంఎంఎస్

ఉపాధి హామీ పథకం మస్టర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పనులకు హాజరు కాకుండానే వేతనం చెల్లించడం వంటి అవకతవకలు జరుగుతున్నాయి. ఇందులో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏటా రూ.కోట్లలో ఉపాధి నిధులు పక్కదారి పడుతున్నట్లు సామాజిక తనిఖీ తెలియజేస్తోంది. అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత నెల ఆరంభం నుంచి అమల్లోకి వచ్చిన ప్రక్రియ గడువు ముగిసినా.. ఈ నెలలో కూడా ఈకేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించినట్లు సబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ అమల్లో తీవ్ర జాప్యం జరగుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఇంకా 2.76 లక్షల మంది కూలీల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. ఈ పథకం అమలులో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కూలీలకు అవగాహన కల్పించి అందరికీ ఈకేవైసీ పూర్తి చేసే దిశగా అధికారు లు చర్యలు చేపట్టకుంటే వారు పనులను కోల్పోయే ప్రమాదం ఉంది.

పల్నాడు జిల్లాలో 5,40,928 మంది కూలీలకు జాబ్ కార్డులకు 5,32,092, బాపట్ల జిల్లాలో 4,32,348 మంది కూలీలకు గాను 4,29,863, గుంటూరు జిల్లాలో 2,03,292 మంది జాబ్ కార్డులకు 1,99,031 మంది కార్డులకు ఆధార్ సీడింగ్ పూర్తయింది.



ఉపాధి పనుల్లో కార్మికులు(పాత చిత్రం)

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పనులు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలు నష్టపోకుండా ఉండేలా.. బోగస్ హాజరును నిరోధించేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) అమలులోకి వచ్చింది. దీంతో పాటు ఫేస్ ఆర్‌డీ యాప్‌ను సైతం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. లేకుంటే చేసిన పనికి వేతనం చెల్లించే పరిస్థితి ఉండదు. ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి వరకు ఆదేశాలు జారీ అయ్యాయి. కూలీలకు అవహగాన లేక పోవడంతో ఈకేవైసీ చేయించు కునేందుకు ముందుకు రావడం లేదు. వారికి అవగాహన కల్పించాల్సి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి కూలీల జాబ్ కార్డు నంబరును నమోదు చేసి, ఐరిష్, ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న కూలీలను మాత్రమే ఉపాధి పనులకు అనుమతిస్తారు.. వేతనాలు చెల్లిస్తారు. ఈ నెల ఆరంభం నుంచి కూలీలు పని ప్రదేశంలో పని ప్రారంభించే ముందు ఒకసారి, పని ముగిశాక మరోసారి వ్యక్తిగత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే కూలీలకు వేతనాలు మంజూరవుతాయి. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టి, పనులకు వెళ్లే కూలీలకు మాత్రమే కూలి అందుతుంది.

జిల్లాల వారీగా ఉపాధి కూలీల ఈకేవైసీ వివరాలు

జిల్లా	కూలీల సంఖ్య	ఈకేవైసీ పూర్తి	ఈకేవైసీ పెండింగ్	శాతం
పల్నాడు	5,32,092	4,03,735	1,28,357	75.87
బాపట్ల	4,29,863	3,40,556	89,307	79.22
గుంటూరు	1,99,031	1,40,063	58,931	70.37

బోగస్ కార్డులకు చెక్

ఉపాధి పనులపై గ్రామాల్లో రాజకీయ నేతల ప్రభావం అధికంగా ఉంది. వీరి కనుసన్నల్లో (మిగతా 6వ పేజీలో)

కళల విందుగా.. బాలల పండుగ !

- ఘనంగా ప్రారంభమైన వీవీఐటీయూ బాలోత్సవ్-2025
- అతిథుల చేతుల మీదగా పోటీలు ఆరంభం
- చిన్నారుల నైపుణ్యం వెలుగులోకి: ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్





8

బాలోత్సవ్‌లో పుస్తకావిష్కరణ చేస్తున్న బుద్ధప్రసాద్, విద్యాసాగర్ తదితరులు

క్రీడల్లో పతకాలు సాధించాలి

ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో జీవీ



8

విద్యార్థులతో కలిసి ఖోఖో ఆడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

బడి నుంచే భవితకు భరోసా!

- పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు
- పల్నాడు జిల్లాలో 66 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ
- సర్వశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అమలు

8

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడి

- అదుపులో 12 మంది నిందితులు
- 32 బైక్‌లు, నగదు స్వాధీనం

6

దళారులను నమ్మి మోసపోవద్దు

- సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి
- కొనుగోళ్లపై అవగాహన సదస్సులో జేసీ ధనుంజయ్

సత్తెనపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోస పోవద్దని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందాలని పత్తి రైతులకు జేసీ గనోరే సూరజ్‌ధనుంజయ్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి పత్తి కొనుగోళ్లపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిదేన్నారు. సీసీఐ క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రక టించిందన్నారు. మార్కెట్‌లో మద్దతు ధర కన్నా తక్కువ ఉన్నంత కాలం సీసీఐ కొనుగోళ్లు చేస్తుందన్నారు. పత్తి దిగుబడులు ముగిశాయని వ్యవసాయశాఖ ధ్రువీకరించే వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే పత్తి కొనుగోలు జరుగుతుందన్నారు. అనంతరం పత్తిలోని తేమ శాతా న్ని ఆయన పరిశీలించారు. సదస్సులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం జగ్గారావు, ఏడీఏలు వీ రవిబాబు, మస్తానమ్మ, మార్కె ట్ యార్డు ఛైర్‌పర్సన్ కోమటినేని శోభా రాణి, శ్రీనివాసరావు, యార్డు కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, ఏవోలు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జేసీ

రజిని అనుచరుల బాధితులు..

పోలీసులను సంప్రదించండి

● పల్నాడు జిల్లా పోలీస్ శాఖ

నరసరావుపేట లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజిని అనుచరుల చేతిలో మోసం, బెదిరింపులకు గురైన బాధితులు పోలీసులను సంప్రదించాలని పల్నాడు జిల్లా పోలీస్ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రజిని అనుచరులు బత్తుల శ్రీగణేష్, బత్తుల కుమారస్వామి, పీఏలు మానుకొండ శ్రీకాంత్ రెడ్డి, దొడ్డా రామకృష్ణ చిలకలూరిపేట మండల పరిధిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. పలువురు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందని తెలిపింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

గంజాయి విక్రేతకు మూడేళ్ల జైలు, జరిమానా

బెల్లంకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేత వలమాల గోవిందు అనే వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ.. గుంటూరు మొదటి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏవీఎల్ సత్యవతి శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ ప్రవీణ్ వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి ఏలూరు మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన గోవిందు.. మండలంలోని చంద్రాజుపాలెం దర్గా వద్ద గంజాయి విక్రయిస్తుంగా.. 2019 అక్టోబరు 27న అప్పటి ఎస్ఐ కె.రాజశేఖర్ అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

రొంపిచర్ల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చయ్యపాలెం సమీపంలో ట్రాక్టర్ తిరగబడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పుట్టా ఏడుకొండలు(54) పొలం పనులు చేసి.. ట్రాక్టర్‌పై వస్తుండగా కాలువ గట్టుపై ట్రాక్టర్ తిరగబడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామస్తులు సమాచారాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియజేశారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడి

● అదుపులో 12 మంది నిందితులు ● 32 బైక్‌లు, నగదు స్వాధీనం

నకరికల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి, చాగల్లు గ్రామాల సరిహద్దుల్లో కోడిపందేల స్థావరంపై నకరికల్లు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ కె.సతీష్ తన సిబ్బందితో పందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. 32 బైక్‌లను, పది కోడి కత్తులను, రూ.20,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకతో.. పందే చూసేందుకు వచ్చిన ప్రజలు, కొందరు నిర్వాహకులు చెల్లాచెదురుగా పరుగులు తీశారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. విద్యుత్ ఉద్యోగి మృతి

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని స్కూటీపై ఇంటికి వస్తున్న విద్యుత్ ఉద్యోగిని వేగంగా కారు ఢీకొట్టటంతో దుర్మరణం చెందారు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ వివరాల మేరకు.. బాపట్ల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పచ్చిపులస రామసురేష్ (54) గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా.. చీరాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రామ సురేష్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడు విజయవాడ వన్‌టౌన్‌ని వాసి. బాపట్ల ఇస్లాంపేటలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పకడ్బందీగా వాటర్ షెడ్ మహోత్సవ్ సభ

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ మహోత్సవ్ సభను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామంలోని చెరువును, లయోలా పాఠశాలలో జరిగే సభ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏర్పాట్లపై ఆలసత్వం వహించవద్దని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్ షెడ్ -పీఎంకేఎస్‌వై జాతీయ సదస్సు 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10న గుంటూరు ఐటీసీ హోటల్లో ప్రారంభ కార్యక్రమం, 11న నల్లపాడు లయోలా పాఠశాలలో జాతీయ సదస్సు జరుగుతుందని వివరించారు. సదస్సు ముందు వెంగళాయపాలెంలోని చెరువు పరిశీలన ఉంటుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జడ్పీ సీఈవో వి జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్, పశ్చిమ తహసీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లయోలాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ

సోషలిజం వైపు యువత చూపు

● సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని చాలా దేశాల్లో పెట్టుబడిదారి వ్యవస్థ కూలిపోతోందని, ఈ దశలో యువత, ప్రజలు సోషలిజం పట్ల ఆకర్షితులవుతున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షతన పెట్టుబడి విధానం - భవిష్యత్తు అనే అంశంపై సభ నిర్వహించారు. ముఖ్య వక్తగా రాఘవులు మాట్లాడుతూ సోషలిజాన్ని నాశనం చేసేందుకు అమెరికా కుట్ర పన్నుతోందని విమర్శించారు. పెట్టుబడిదారి విధానం శాశ్వతంగా ఉంటే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. సోషలిజం అంటే ట్రంప్‌నకు భయమని, అయన పెట్టుబడిదారులకు ప్రతినిధిగా వ్యవహరిస్తారని ఆరోపించారు. మోదీ కూడా ట్రంప్ అడుగుజాడల్లో పయనిస్తున్నాడని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు మోదీ విధానాలను వ్యతిరేకిస్తున్నారని, అందుకే 2024 ఎన్నికల్లో బీజేపీకి సీట్లు గణనీయంగా తగ్గాయన్నారు. ఢిల్లీలోని జవహర్, పుదుచ్చేరి విద్యాలయాల్లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఏబీవీపీ ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. యువత, విద్యార్థులు, సోషలిజం వైపు మొగ్గుచూపుతున్నారన్నదానికి ఈ ఎన్నికలు నిదర్శనమని అన్నారు. గూగుల్ లాంటి సంస్థలతో సమాచారం తెలుస్తుందే తప్ప ఆశించిన ఉద్యోగాలు రావన్నారు. వైజాగ్‌లో ఏర్పాటు చేసే గూగుల్ సెంటర్‌తో కేవలం 300 ఉద్యోగాలు మాత్రమే వస్తాయన్నారు. అదే విశాఖ ఉక్కు పరిశ్రమ ద్వారా 30వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. పైగా గూగుల్ సెంటర్‌తో భవిష్యత్తులో వైజాగ్ వాసులకు నీరు, విద్యుత్ కష్టాలు వస్తాయని అన్నారు. పైగా ప్రజలకు డాలర్‌పై పూర్తిగా నమ్మకం పోయిందని, అందుకే చాల మంది చైనా కరెన్సీ యువాన్‌ను ప్రతి ఒక్కరూ దాచుకుంటున్నారని తెలిపారు. చైనాలో తయారు చేస్తున్న వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ అవుతున్నాయని, ఆ దేశం శాస్త్ర సాంకేతికంగా ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, పాశం రామారావు, ఈమని అప్పారావు, నళినికాంత్, భావన్నారాయణ, అరుణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీవీ రాఘవులు, కేఎస్ లక్ష్మణరావు, బాబురావు

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి.. వందేమాతరం

గుంటూరు సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశభక్తి భావంతో పాటు స్వాతంత్ర ఉద్యమంలో స్ఫూర్తిగా వందేమాతర గీతం నిలిచిందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. వందేమాతరం గితం రచించి 150 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సమావేశానికి ఏఓ రత్నబాబు అధ్యక్షత వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, బకిమ్ చంద్ర చటర్జీ చిత్రపటాలకు నివాళులర్పించారు. చైర్‌పర్సన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్వాతంత్ర్య సమరంలో వందే మాతరగీతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. సీఈఓ వీర్ల జ్యోతి బస్సు మాట్లాడుతూ జాతిని ఏకతాటిపైకి తెచ్చి ప్రజల్లో దేశభక్తి భావాన్ని వందేమాతర గీతం పెంపొందించిందని అన్నారు. ఇది ప్రజలకు మంచి ప్రేరణగా నిలిచిందన్నారు. సమావేశంలో అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ

సైన్స్ ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలి

ఏఎన్‌యూ నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని ఎస్ఈఆర్టీ సంచాలకులు ఎంవీకృష్ణారెడ్డి కోరారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్ఈఆర్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో శుక్రవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు సైన్స్ రంగంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి సుమారుగా 230 మంది విద్యార్థులు, 50 మంది గైడ్ అధ్యాపకులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బృందాలు ఈ నెల 20, 21న బెంగళూరులో జరిగే సౌత్ ఇండియా సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని నోడల్ అధికారి ఆచార్య ఎన్.వి.నాగమణి చెప్పారు. విజేతలకు సంచాలకులు కృష్ణారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకుడు భూషణ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంచాలకులు కృష్ణారెడ్డి

దేశభక్తి జ్వాలలు రగిల్చిన వందేమాతరం

వందేమాతరం గీతం స్వాతంత్రోద్యమంలో ప్రజల గుండెల్లో దేశభక్తి జ్వాలలు రగిల్చిందని డాక్టర్ బీ.ఆర్.ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏఎన్‌యూలోని ఆచార్య హరగోపాల్‌రెడ్డి సెమినార్ హల్ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతరంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహోన్నత గేయాన్ని మహాకవి బంకిమ్ చంద్రచటర్జీ 1875 నవంబర్ 7న రచించారని తెలిపారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ వందేమాతరానికి 150 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎస్.మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రీవాల్యూయేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ మొదటి మూడు నాలుగు సెమిస్టర్ల రీవాల్యూయేషన్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు.

డిసెంబరు 9 వరకు 279 ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - మునమాక రైల్వే స్టేషన్ల మధ్యన ఆర్‌యూబీ నంబరు 279 వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేటుని ఈ నెల 10 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు మూసేస్తున్నట్లు రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తనపల్లి వెళ్లే రహదారి పునరుద్ధరణ పనులు వర్షాల కారణంగా ఆలస్యం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా ఎల్‌సీ నంబరు 276 ద్వారా ప్రయాణించాలని సూచించారు.

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పెట్టినట్లు గుర్తుచేశారు. 33 ఏళ్ల వయసులోనే ఆయన రైతుల ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన అడ్డుకున్నారన్నారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా చేసిన సేవలకు గిన్నిస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలన్నారు.

సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ వీవీ సత్యనారాయణ, శాస్త్రవేత్త కుర్రా శ్రీనివాసబాబు, ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి.యుగంధర్, బి. నాగేశ్వర్‌మిత్రా, ఆదర్శ రైతు కుంచాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ 'పెండింగ్'?

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను ఫీల్డు అసిస్టెంట్లుగా నియమించుకోవడం అనవాయితీ. రాజకీయ అండదండలు, అధికారుల సహకారంతో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. ఈకేవైసీ, ఎన్ఎంఎంఎస్‌ను అమల్లోకి తీసుకురావడంతో బోగస్ జాబ్ కార్డులకు కూడా చెక్ పెట్టినట్లయింది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రైవేట్ ఉద్యోగుల పేర్లపై జాబ్ కార్డులు సృష్టించి వేతనం కోట్టేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. పనికి రాకుండానే రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఉపాధి కార్మికుని పేరుతో వేతనాలు చెల్లించడం పెద్దఎత్తున జరుగుతోంది. ఏటా రూ కోట్లలో ఉపాధి నిధులను కొందరు అధికా రులు.. ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుతింటున్న ఉదంతాలు సామాజిక తనిఖీలో వెలుగు చూసినా.. వారిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కోట్టేసిన సోమ్మును రికవరీలు కూడా ఉండటం లేదు. నూతన హాజరు విధానంతో కొంత మేర అక్రమాలను అరికట్టే అవకాశం ఉంది.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

● చర్యలు తీసుకోవాలంటూ బంధువుల నిరసన

రెంటచింతల, గురజాల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగారపు ఉంగరం అపహరణ చేశారంటూ.. ఇంటి దగ్గరకొచ్చి దుర్భాషలాడడాన్ని అవమానంగా భావించి గడ్డి మందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రెంటచింతలలోని అంబేడ్కర్ కాలనిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున వివరాల మేరకు.. కొత్తపల్లి వాణి(36) అనే మహిళ ఆడేపు సరిత గృహంలో చోరీ చేసింది. దీనిపై కుల పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ ఉంగరాన్ని ఎక్కడ విక్రయించావంటూ వాణిని నిలదీయడంతో అవమానంగా భావించి.. ఈ నెల 4న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యకు కారణమైన దోషులపై చర్యలు తీసుకోవాలంటూ గురజాల పట్టణంలోని బ్రహ్మనాయుడు సెంటర్‌లో వాణి మృతదేహంతో బంధువు నిరసన తెలిపి.. రాస్తారోకో చేశారు. కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు వారికి సర్దిచెప్పడంతో నిరసనను విరమించారు. మృతురాలికి ముగ్గురు సంతానం, భర్త ప్రేమ్‌కుమార్ పదేళ్ల కిందట మృతి చెందాడు. మృతురాలి తమ్ముడు దేగల చిన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

మేడికొండూరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒక లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం మేడికొండూరు మండలం జంగంగుంటపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. మేడికొండూరు సీఐ ఖాజీబాబు కథనం మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం బొల్లవరం గ్రామానికి చెందిన డ్రైవర్ కాలే ప్రసాద్(23) సాతులూరు నుంచి పేరేచర్ల మీదుగా సత్తెనపల్లి వైపు లారీని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు ఆధారంగా మేడికొండూరు ఎస్ఐ ఖాజీబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

21 నుంచి రాజధాని గ్రామాల అభివృద్ధి పనులు

● 29 గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలు, వీధి దీపాల ఏర్పాటు

● పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టీకరణ

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ శుక్రవారం తెలిపారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాజధానిలోని 29 గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంతోపాటు అన్ని గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కాగా రాజధాని అమరావతికి భూసమీకరణ ద్వారా భూములిచ్చేందుకు రైతులు ముందుకొచ్చిన నేపథ్యంలో రాజధానితోపాటు, వారు నివసించే గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు ఈ ఏడాది రాజధాని గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 904 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ మొత్తాన్ని ఇప్పుడు ఖర్చు చేసి రాజధాని గ్రామాల రూపు రేఖలను ప్రభుత్వం మార్చబోతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

45,026 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 38,186 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,026 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	16000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	16000
273	---	---	నెంబరు. 5	10000	14500
341	10000	16800	273	---	---
4884	---	---	341	10000	17000
సూపర్ 10	---	---	4884	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16300
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	15500
దేవనూరు డీలక్స్	10000	15700	తాలుకాయలు	5000	8700

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

బాల్య వివాహాలు, కిషోర వికాసంపై అవగాహన కలిగి ఉండాలి

క్రోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవటం, కిషోర వికాసంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని క్రోసూరు ఎంపీడీవో పీ రవికుమార్ అన్నారు. గుడ్ షఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఎంపీపీ పెరుమాళ్ళపల్లి కోటయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్, దాసరి విజయ బెన్నిబాబు, సిస్టర్ యాంటో తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పిడుగురాళ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 32వ వార్డుకు చెందిన కొమ్ము సంతోషరావు కుటుంబానికి టీడీపీ నాయకులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. సంతోషరావు మృతిచెందిన విషయం తెలుసుకున్న పార్టీ నేతలు సంతోషరావు కుటుంబానికి రూ.10వేలు అందజేశారు.

సెల్ ఫోన్‌లు బాధితులకు అందజేత

దాచేపల్లి: సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న ఆరుగురు వ్యక్తులకు రికవరీ చేసి దాచేపల్లి సీఐ భాస్కరరావు బాధితులకు అందజేశారు. శుక్రవారం పోలీసులు తెలియజేస్తూ 2024లో ఆరు మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో దాచేపల్లి ఎస్ఐ పాపారావు ఉన్నారు.

14 మంది జూదరుల అరెస్టు

పేకాడుతున్న 14మందిని అదుపులోకి తీసుకొని వారినుంచి రూ.21,050 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పాపారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని పెదగార్లపాడులో పేకాట స్థావరంపై సిబ్బందితో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పల్నాడు స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్‌పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్ విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్స్ కే వేణు, జీ కృష్ణారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

● సత్తెనపల్లి: ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ మోహనరావు శుక్రవారం పట్టణంలోని ఉపఖజానా కార్యాలయాన్ని తనిఖీచేశారు. ఉపఖజానా అధికారులు, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నేతలు పీ మణిరావు, జాన్‌వెస్లీ, అంబేద్కర్, ఇబ్రహీం, అశోక్ తదితరులు ఆయనను కలసి జ్ఞాపిక అందజేశారు.

10న జాబ్ మేళా

సత్తెనపల్లి: పూదోట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ పట్టణంలోని నరసరావుపేట రోడ్డు పూదోటగ్రౌండ్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు పూదోట రాజు శుక్రవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజి, డిప్లమా కోర్సులు చదివిన యువతీయువకులు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

నకరికల్లు: ఆరోగ్య విస్తరణాధికారుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా కొంపల వెంకటేశ్వర్లును శుక్రవారం ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి తెనాలి లూర్దురాజు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాసరావు వ్యవహరించారు.

డివిజన్ స్థాయి కబడ్డీ టీంకు దుర్గి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి

దుర్గి: అండర్-17 బాలుర కబడ్డీ డివిజన్ స్థాయి జట్టుకు దుర్గి జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి మజ్జిగ చంద్రశేఖర్ ఎంపికైనట్లు హెచ్‌ఎం హనుమంతురావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో చంద్రశేఖర్‌ను అభినందించారు.

టీచ్ టూల్స్‌పై శిక్షణ

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం టీచ్ టూల్స్‌పై శిక్షణ నిర్వహించారు. ఎంఈవోలు ఎండీ ఖాసీం, బెంజిమెన్‌లు ప్రారంభించారు. కాలానుగుణంగా విద్యాబోధన చేసేందుకు ఇవి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

9న రక్తదాన శిబిరం

మాచర్ల రూరల్: సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవాసమితి, సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన పట్టణంలోని సొసైటీకాలనీలో సత్యసాయి సామాజిక సేవా ఆరోగ్యకేంద్రంలో ఈనెల 9వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, శ్రీసత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపాల్ వై రమాదేవి తెలిపారు. శుక్రవారం సత్యసాయి విద్యావిహార్‌లో విలేకరులతో మాట్లాడారు.

● దుర్గి: అఖిల భారత అయ్యప్పభక్తుల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా బండ్ల అప్పారావు నియమితులయ్యారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రెంటచింతల: రెంటచింతలకు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.70లక్షల నిధులు మంజూరైనట్లు మాజీ ఉప ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం పలు కాలనీల్లో నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ, సొసైటీ చైర్మన్ టి.జోజిరెడ్డి, ఎం.రాజ్‌కుమార్, ఇన్నయ్య, బాలయోగి, లవయ్యాసాగర్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం అధ్యక్షుడిగా రాము

కారంపూడి: కారంపూడి మండల కమ్మ సంఘం అధ్యక్షుడిగా చప్పిడి రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కమ్మ సంఘీయుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. టీడీపీ కార్యదర్శి పంగులూరి అంజయ్య, బొల్నేడి శ్రీనివాసరావు, కొంగర హరిసత్యనారాయణ, మద్దిరాల ఉమామహేశ్వరరావు, గుండాల వెంకటేశ్వర్లు, నాయుడు లక్ష్మీనారాయణ, చిరుమామిళ్ల శ్రీనివాసరావులు మద్దతు తెలపడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉపాధ్యక్షుడిగా గుట్లపల్లి వెంకటప్పయ్య, కార్యదర్శిగా మల్లయ్య, కోశాధికారిగా కొండపల్లి అప్పారావు, కార్యనిర్వహణాధికారిగా గర్నేడి రోశయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉన్నం లక్ష్మీనారాయణ, మునుగోటి సత్యం, దొడ్డా వెంకటనారాయణ, కోదాటి ప్రభాకర్, కందిమళ్ల లక్ష్మయ్య, పెమ్మసాని ఏడుకొండలు, సాంబశివరావు, యరపతినేని రామయ్య, నర్రా శ్రీను, వసంత రామారావు, మాదల సత్యనారాయణ, పంగులూరి లక్ష్మయ్య, ఉన్నం ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

కలాం స్ఫూర్తితోనే అభివృద్ధి: మున్సిపల్ చైర్మన్

మాచర్ల రూరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన అబ్దుల్ కలాం సేవాసమితి సభ్యుల ఆత్మీయసమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీవైఈవో రామకృష్ణారావు, గురజాల మున్సిపల్ చైర్మన్ బడే జాని, పట్టణ సీఐ తురకా వెంకటరమణ, సమితి వ్యవస్థాపకుడు షేక్ పాషావలి, డాక్టర్ శివనాగిరెడ్డి, కేపీచారి, దశరథ్, లక్ష్మీప్రసన్న, కే శ్రీనివాసరావు, ఎంపీఐ శేషిరెడ్డి, నాగూర్‌వలి, వెంకట్రామయ్య, జి.శ్రీనివాసరావు, పవర్‌గ్రిడ్ డీజీఎం దివాకర్ పాల్గొన్నారు.

9న బెల్లంకొండకు ఎమ్మెల్యే రాక

బెల్లంకొండ: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈనెల 9వ తేదీన బెల్లంకొండ మండలంలో పర్యటించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు వెంకటాయపాలెం-మన్నెసుల్తాన్‌పాలెం వరకు బీటీ రోడ్డుకు, రామాంజీపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారు. కోళ్ళూరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ పాలకమండలి, నందిరాజుపాలెం సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాచేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నడికూడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దాచేపల్లి పట్టణ ఏఈ భగవాన్‌నాయక్ తెలిపారు.

● నకరికల్లు: మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఏఈఈ జీ సుచరిత శుక్రవారం తెలిపారు.

భారతజాతి విజయగీతిక వందేమాతరం



మాచవరం బస్టాండ్ సెంటర్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు తదితరులు



మాచర్ల: వందేమాతర గీతం ఆలపిస్తున్న సీఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది



సత్తెనపల్లి: మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు

సత్తెనపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరావతి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతరం 150 సంవత్సరాల స్మారకోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సూర్యదేవర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 75 అడుగుల జాతీయజెండాతో విద్యార్థులు పట్టణంలోని ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. సీఐ నాగమల్లేశ్వరరావు వందేమాతరం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో వందేమాతరం గీత స్మారక వేడుకలను ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందేమాతర గీతం గురించి ఆర్డీవో వివరించారు. వేడుకల్లో విద్యార్థులు, తహసీల్దార్ చక్రవర్తి, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్, వివిధ పాఠశాలల్లో స్మారకోత్సవాన్ని నిర్వహించారు.

● దాచేపల్లి: వందేమాతర గీతం 150వ సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గామాలపాడు శివారు ఆంధ్రా సిమెంట్స్‌లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం జాతీయజెండాను ఆవిష్కరించారు. వైస్‌ప్రెసిడెంట్ సుబ్బారావు మాట్లాడుతూ వందేమాతరం గేయ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌వో కొండారెడ్డి ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బంది జాతీయజెండాను వందనం చేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాల ఉద్యోగులు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

● మాచవరం: మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో వందేమాతరం గీతాన్ని శుక్రవారం ఆలపించారు. ఈ గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎస్ఐ తిరుపతిరావు మాచవరంలోని బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులతో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయాల్లో గీత రచయిత బంకింగ్‌చంద్ర చటర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: జాతీయ గీతం వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని నందిగామలో శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు 150 అడుగుల జాతీయజెండాను చేతబూని గ్రామ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ నాయకులు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

● అచ్చంపేట: స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, భూక్యా రమేష్, హెచ్‌ఎం ఇన్నారెడ్డి, అసిస్టెంట్ ఎంపీడీవో మురళీకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● క్రోసూరు: వందేమాతరం గేయం శాబ్దిన్నర ఉత్సవం శుక్రవారం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ రవి కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఈ గీతం ఎంతో ప్రభావితం చేసిందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో మానవహారం నిర్మించారు. పలు పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

● అమరావతి: స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాటవీరులను చైతన్యపరిచేలా బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయం అవిర్భవించి 150సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వాడవాడలా శుక్రవారం సామూహికంగా విద్యార్థులు, అధికారులు, ప్రజలు గీతాన్ని ఆలపించారు. ధ్యానబుద్ధ ప్రాజెక్టు సమీపంలోని బుద్ధవనంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు సామూహిక గేయాలాపన చేశారు. ప్రతి గ్రామంలోని పాఠశాలల్లో విద్యార్థులు, సిబ్బంది గీతాన్ని ఆలపించారు. బుద్ధవనంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఎం.హనుమంతరావు, ఎంపీడీఓ పార్వతి, తహసీల్దార్ దానియేలు, సీఐ అచ్చియ్య, ఎంఈఓ శివబాబు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ జైనాబ్ జహన్, అంగనవాడీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గుడిపూడి ఇంద్రాణి వేసిన డ్రాయింగ్ ఆకర్షించింది.

● పెదకూరపాడు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు, గ్రామపెద్దలు వందేమాతర గీతం ఆలపించారు. కార్యక్రమంలో లగడపాడు పాఠశాలలో పూర్వ విద్యార్థి చిల్లపల్లి సత్యం, సర్పంచ్ వేమవరపు నాగేశ్వరరావు, హెచ్‌ఎం నండూరి సురేష్, మహమ్మద్ షబ్బీర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● మాచర్ల: దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన మహోజ్వల మంత్రం వందేమాతరం అని పట్టణ సీఐ తురకా వెంకటరమణ అన్నారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వందేమాతరం గీతాన్ని సిబ్బందితో కలిసి ఆలపించారు.

● విజయపురిసౌత్: భారతజాతి విజయగీతిక వందేమాతరం అని ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్ నయీంబాను అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులు, సీఆర్పీఎఫ్ జవాన్లు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే బాషా, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కెప్టెన్ విజయ్ కుమార్, సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ గిరీష్‌చంద్‌భట్, ఎస్ఐ కిమెస్సింగ్, ఎస్ఐ బసవరాజు పాల్గొన్నారు.

● కారంపూడి: వందేమాతర గేయం స్వాతంత్ర్యానికి ప్రేరణ అని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియంలో హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరావు, కరస్పాండెంట్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్రశాలను ఆధునిక సొబగులతో తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని నూతన సొబగులతో తీర్చిదిద్దేందుకు భారీ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఇంజనీరింగ్ అధికారులు, పార్టీ నేతలు, భక్తులతో విస్తృతసమావేశం నిర్వహించారు. తొలుత ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్యల నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. 2028 కల్లా ఆలయానికి తుదిరూపం రావాలన్నారు. సమావేశంలో ఎండోమెంట్ డీఈ సీహెచ్ శ్రీనివాసులు, ఏఈ జయప్రకాష్, సహాయ స్థపతి శ్రీనివాసాచార్యులు, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, ప్రభురాజ్, గొట్టం శ్రీనివాసరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, గురవారెడ్డి, నీలం మల్లయ్య, కావూరి నాగయ్య, సొసైటీ చైర్మన్ జోజిరెడ్డి, ఎన్.నరసింహారావు, సాయి, కోరే నాగేశ్వరరావు, పోట్ల సైదారావు, పుంగులూరి పుల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు. ఆలయంలో అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



రెంటచింతల: ఇంజనీర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

● కారంపూడి వీరుల తిరునాళ్ల పోస్టర్లను ఎమ్మెల్యే సత్రశాల ఆలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 19నుంచి 23వరకు తిరునాళ్లను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్‌చెన్నకేశ అయ్యవారు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఆర్థిక భరోసా సభ్యత్వ భీమా

వెల్దుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కష్టకాలంలో ఆర్థికభరోసాను ప్రమాద బీమా రూపంలో అధిష్టానం అందిస్తోందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. టీడీపీ సభ్యత్వం తీసుకొని ప్రమాదాల్లో మృతిచెందిన ముగ్గురు కార్యకర్తల కుటుంబానికి శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రూ.5లక్షల చొప్పున నగదు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వడ్డెర కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.దుర్గారావు, తోట వీరాంజినేయులు, లోయపల్లి హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆరోగ్యాంధ్ర సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో 42మంది లబ్ధిదారులకు రూ.29.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమినేతలు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో పోలీస్‌స్టేషన్ నిర్మాణం

మాచర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక హంగులతో మాచర్ల పోలీస్‌స్టేషన్ నిర్మాణపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన భవనాలను పరిశీలించి సీఐ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, యాగంటి మల్లికార్జునరావు, కొమెర రాములు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్‌తో కూటమి సర్కార్ పరుగులు

● సబ్‌ట్రెజరీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ వేగంతో అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాజుపాలెంలో కొత్త భవనంలోకి మార్చిన తహసీల్దార్ కార్యాలయాన్ని, నూతనంగా నిర్మించిన సబ్‌ట్రెజరీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణం చురుగ్గా సాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, అంచుల నరసింహారావు, పూజల వెంకటకోటయ్య, పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, సర్పంచ్‌లు కనదం పద్మ శ్రీనివాసరావు, పసుపులేటి వెంకటస్వామి, తోట శ్రీనివాసరావు, కుందూరు పేతురు, నాయకులు అంకాళ్ల ప్రభుదాసు, షేక్ అల్లాభక్షు, మొరసా శ్రీనివాసరావు, పి.సాంబశివరావు, చొక్కా శ్రీనివాసరావు, జె.కోటేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రాజుపాలెం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

సత్తెనపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో కూటమి ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ నియోజకవర్గంలో, వార్డుల్లో జరిగిన అభివృద్ధిని కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు ధ్రువపత్రాల మంజూరు విషయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు పారదర్శకతతో పని చేయాలన్నారు.

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అండ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్ టీడీపీ ప్రజావేదికలో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులను కన్నా పంపిణీ చేశారు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 23మందికి రూ.16,97,608 చెక్కులను అందించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, కొనికినేని సత్యనారాయణ, ఆళ్ళ అమరేశ్వరరావు, మన్నవ శారదాదేవి, బత్తుల నాగేశ్వరరావు, కళ్ళం వీరభాస్కర్‌రెడ్డి, మస్తాన్‌వలి, అంబిక, పూజల వెంకట కోటయ్య, మామిడి వెంకటేశ్వరరావు, ఎం.రామచంద్రరరావు, నూర్‌బాషా జానీబాబు, మారిశెట్టి అప్పారావు, రంగిశెట్టి సుమన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో క్యాన్సర్‌ను జయించవచ్చు

క్రోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ని జయించవచ్చని వైద్యాధికారులు మహమ్మద్ షాద్, డాక్టర్ జాఫ్రిన్, డాక్టర్ సిరిచందన అన్నారు. శుక్రవారం క్రోసూరులో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది పాఠశాల విద్యార్థులతో ప్రధానవీధిలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవటం, క్రమంతప్పని వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత దినచర్యగా అలవాటు చేసుకోవాలన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నుంచి రక్షించుకోవచ్చన్నారు. క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం అని నినాదాలు చేశా రు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్, సూపర్‌వైజర్ శివుడు పాల్గొన్నారు.

తొలి దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నివారణ

దాచేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ డే సందర్భంగా దాచేపల్లి వైద్యాధికారి డాక్టర్ షేక్ సాహీనా సుల్తానా ఆధ్వర్యంలో దాచేపల్లి పీహెచ్‌సీలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సుల్తానా మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచిత పరీక్షల ద్వారా నోరు, బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించి నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధు, పట్టాభి, లక్ష్మయ్య, లలిత కుమారి, మేరీ కుమార్ తదితరులు ఉన్నారు.



బెల్లంకొండ: క్యాన్సర్ నిర్మూలన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సబ్‌సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలి

బెల్లంకొండ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సబ్‌సెంటర్‌లో క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని అన్ని సబ్‌సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎంలు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఏఎన్‌ఎంలు, హెల్త్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్‌పై సమీక్ష

రాజుపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ పత్తిపాటి విజయకుమార్ శుక్రవారం గణపవరం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. 24 గంటలు విద్యుత్ సరఫరాపై జరిగే నూతన పనులపై ఎస్ఈ సమీక్ష నిర్వహించారు. గణపవరం పరిధిలో విద్యుత్ సరఫరాలో పలు ఫిర్యాదులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ సింగయ్య, లక్ష్మణ్‌నాయక్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం



మాట్లాడుతున్న పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రవల్లిక

పిడుగురాళ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీన జరుపనున్నట్లు పిడుగురాళ్ల జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి టి.ప్రవల్లిక తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్‌లో న్యాయ సేవల దినోత్సవం గురించి విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల న్యాయపరమైన హక్కులు, చట్టాల గురించి న్యాయాధికారి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, కె.వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ ఆధ్యాత్మిక చింతన కలిగివుండాలి

● టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి



అయ్యప్పస్వాములతో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేడు జీవితంలో అందరికీ ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీలోని శ్రీలక్ష్మీరంగనాయకస్వామి ఆలయంలో 25రోజులుగా జరుగుతున్న మాలధారణ స్వాముల సద్దికార్యక్రమానికి జంగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో, ఇతర అధికారులు

అచ్చంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అసిస్ట్, ఐటీసీ ఆధ్వర్యంలో అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, సర్పంచ్‌లకు, ఎస్‌హెచ్‌వీవోలకు, సీఆర్పీలకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అసిస్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అసిస్ట్ ట్రైనర్ సీహెచ్ బోలయ్య మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించాలని, తద్వారా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, ఎంపీడీవో కే శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎంపీడీవో జీ మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయకుమార్

పిడుగురాళ్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆ శాఖ ఎస్ఈ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం కొండమోడు విద్యుత్‌శాఖ కార్యాలయంలో పిడుగురాళ్ల సబ్‌డివిజన్ పరిధిలో ఏఈలతో స్మార్ట్‌మీటర్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ సింగయ్య, ఏడీఈ లక్ష్మణ్‌నాయక్, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

● యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతీ బద్రి



యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతీ బద్రిని సన్మానిస్తున్న యార్డు డైరెక్టర్‌లు

దాచేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి యార్డు డైరెక్టర్ల సమావేశంలో పలు ప్రతిపాదనలు పెట్టినట్టు గురజాల మార్కెట్‌యార్డు చైర్మన్ బెల్లంకొండ భారతీ బద్రి అన్నారు. శుక్రవారం దాచేపల్లిలోని నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్, డైరెక్టర్లతో కలసి తొలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో యార్డు చైర్మన్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా క్రాపు బుకింగ్ చేసుకోవాలని కోరారు. యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. యార్డు వైస్‌చైర్మన్ బత్తుల మల్లారెడ్డి, సభ్యులు జక్కా సుబ్బయ్య, దండె సౌభాగ్యం, పఠాన్ జానీబాషా, బత్తుల చిననరసింహారావు, జమ్మిగుంపుల శివన్నారాయణ, ముక్కపాటి అనసూర్యమ్మ, గరికపాటి కోటేశ్వరి, కొత్తపల్లి దేవి, కత్తి సుజాత, రొండీ ఏడుకొండలు, కొత్త ఆదం, నందా నాయక్, అక్కినిగుంట వెంకట నరసమ్మ పాల్గొన్నారు.

బోధనాభ్యాసాలను మెరుగుపర్చడమే టీచ్ టూల్ లక్ష్యం

క్రోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన సమయాన్ని పెంచటం, నాణ్యమైన బోధనా పద్ధతులను మెరుగుపరచటం టీచ్ టూల్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంఈవో కృష్ణ అన్నారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో ఎంపికచేసిన 40మంది ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమైంది. రెండురోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. ప్రపంచ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్‌లోని సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 గణేష్ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జేసీ



తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ఘనోరే

రాజుపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చడంతో శుక్రవారం జేసీ సూరజ్ ఘనోరే కార్యాలయాన్ని సందర్శించారు. పాత తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా సందర్శించిన జేసీ రీసర్వే వివరాలను తహసీల్దార్ సరోజను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ రమాకాంత్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఉద్యాన శాఖ అధికారి అంజలి



మిర్చి పైరును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి అంజలి తదితరులు

మాచవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నీరునిల్వ ఉండి మిర్చి పంటలో ఆకులు పసుపురంగుగా మారుతున్నాయని, దీనిని వారణకు 19-19-19 ఐదుగ్రాములు, సూక్ష్మపోషకాల మిశ్రమం 5గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుమూడుసార్లు పిచికారి చేయాలని ఉద్యానశాఖ అధికారి అంజలి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరంలో మిర్చిపంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అరుణకుమారి పాల్గొన్నారు.

బడి నుంచే భవితకు భరోసా!

- పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు
- పల్నాడు జిల్లాలో 66 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ
- సర్వశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అమలు..


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

నరసరావుపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో చదువు ఒక్కటే ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు చదువుతో పాటుగా వృత్తి విద్యా కోర్సులు నేర్పించాలని దృఢ ంగా సంకల్పించారు. వృత్తి విద్యా కోర్సులు.. ఉన్నత చదువులకు ఉపయోగపడటంతో పాటు.. స్వయం ఉపాధికీ తోడ్పడతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు పాద్రాన్యమిస్తూ.. వృత్తి విద్యా కోర్సులకు అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసింది.

పల్నాడు జిల్లాలో 66 పాఠశాలల్లో అమలు

సమగ్ర శిక్ష సమాచారం మేరకు.. పల్నాడు జిల్లాలో వివిధ రకాల 66 పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు అమలు చేస్తున్నారు. ఇందులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు -13, ఏపీ మోడల్ స్కూల్స్ -14, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు -5, వినుకొండ ప్రభుత్వ పాఠశాల, నరసరావుపేట మున్సిపల్ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలు-32 ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉపాధి అవకాశాలు పొందే పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

ఈ కోర్సులు ఉపాధికి ఉపయుక్తం

బాలబాలికల జీవన ప్రయాణానికి వృత్తి విద్యా కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ.. అన్ని విధాలా సహకరిస్తోంది. కోర్సుల నిర్వహణకు అవసరమైన పరికరాలు సరఫరా చేస్తోంది. చదువు పూర్తయ్యే సరికి ఈ కోర్సులు పూర్తి చేసుకుని ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులు పొందుతారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

- రేవతి, జీసీడీవో సమగ్రశిక్ష, పల్నాడు జిల్లా

పది కోర్సులు 125 మంది శిక్షకులు

పది రకాల కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. ఇందులో ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్ వ్యాపారం, ఎలక్ట్రానిక్స్ హెల్త్‌కేర్, ఐటీ, ఆహారశుద్ధి, వీఎఫ్ఎస్ఐ, వ్యవసాయ అంశాలతో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో నైపుణ్యాలు పెంచేందుకు 125 మందిని ప్రత్యేక శిక్షకులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 12వేల నుంచి 14 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సమగ్రశిక్ష పర్యవేక్షణ చేస్తోంది. ఒక్కో ట్రేడ్‌లో శిక్షకులకు ప్రాక్టికల్స్ రవాణా, భోజన సదుపాయాల కింద రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తోంది.

మహిళలకు బ్యూటీ కోర్సులు

బాలికలకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ వొకేషనల్ కోర్సుతో ఎంతో ఉపయోగం ఉంది. ఈ కోర్సు నేర్చుకుంటే బాలికలు నివశించే పరిసరాల్లోనే బ్యూటీపార్లర్, లేడీస్ కార్నర్, ఫ్యాన్సీ షాపులు పెట్టుకుని ఉపాధి పొందవచ్చు. పైగా ఇంట్లోనే ఉంటూ వీటిని నడుపుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈ కోర్సుపట్ల బాలికలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

క్రీడల్లో పతకాలు సాధించాలి

ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో జీవీ


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సెకండరీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 బాలబాలికల ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ఎంపిక పోటీలను స్థానిక లయోలా స్కూల్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమిని అంగీకరించే సాహసంతో పాటు గెలుపులో వినయం, స్నేహ భావం కలిగి ఉండాలన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు అశ్విత నృత్య ప్రదర్శన క్రీడాకారులను ఆకట్టుకుంది. అనంతరం జీవీ క్రీడాకారులతో ఖోఖో ఆడి ఉత్సాహాన్ని నింపారు.

ఆడుదాం.. అంటూ దోపిడీ

ఆడుదాం ఆంధ్ర పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రూ.వందల కోట్లను దోచుకుందని జీవీ ఆరోపించారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 854 పీఈటీ పోస్టుల నియామకం చేపట్టిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వం, మంత్రి లోకేశ్‌దేన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య, సెక్రటరి సురేష్, పాఠశాల హెచ్ఎం అవినాశ్, పీఈటీ చిరంజీవి, ఉపాధ్యాయ సంఘ నాయకులు యు.చంద్రజిత్‌యాదవ్, గంగినేని రాఘవ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, షకీలా బేగం, జనసేన పార్టీ నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాన్ని నడిపించగల శక్తి వేదానికే ఉంది

- కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతీ మహాస్వామి


రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద కలశ పూజ చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి


కార్యక్రమానికి హాజరైన భక్తులు

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్వాన్ని నడిపించగల శక్తి ఒక్క వేదానికే ఉందని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహా స్వామి ఉద్బోధించారు. బాపట్ల పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీగంగాపర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ శతవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విజయేంద్ర సరస్వతీ మహాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడదారి పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించడంతోపాటు విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. దేశంలో సాంస్కృతిక, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, కొరవడుతున్న నైతిక, మానవీయత విలువల్ని రక్షించే రీతిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పురాతన సాహిత్యాన్ని కాపాడటం, సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించటం సనాతన ధర్మానికి కంకణబద్దులై పనిచేయడం ప్రధాన కర్తవ్యంగా.. మానవజన్మ సార్ధకత కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు విజయేంద్ర సరస్వతీ మహా స్వామికి బాపట్లలో ఘన స్వాగతం లభించింది. బాపట్ల పాత బస్టాండ్ వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం స్వామిజీ మహాయజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కంచి స్వామి భావదేవుని ఆలయంలో ఒక రాత్రి బస చేశారన్నారు. తనకు ఆ అనుభూతి లభించిందన్నారు. కార్తీక మాసంలో దీపోత్సవం చేయటం వల్ల ప్రజలకు సుఖశాంతులు కలుగుతాయన్నారు. ద్రేవాలయాలలో సామూహికంగా దీపోత్సవం చేయడం మంచిదన్నారు. కంచి మఠం తరుపున గుంటూరులో శంకరకంటి ఆసుపత్రి నందు రూ.70కోట్లతో నూతన భవనం నిర్మించటం జరిగిందని, ఈ నెల 9న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం శ్రీ శంకర విద్యాలయం వేద పాఠశాలను సందర్శించారు. పాఠశాల సభ్యులకు, విద్యార్థులకు, గురువులకు అనుగ్రహభాషణం అందించారు. శంకర విద్యాలయ సభ్యులు బి.బాబునాగేంద్ర, శిఖరం భుజిగేంద్రమౌళి, చలపతిరావు, శ్రీరామ శర్మ, శ్రీకాంత్, ప్రతాప్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

మరమ్మతులు పూర్తి.. రెండో యూనిట్ వాడుకలోకి

రెంటచింతల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండో యూనిట్‌కు మరమ్మతులు పూర్తి చేశామని శుక్రవారం నుంచి వాడుకలోకి వచ్చిందని ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. రెంటచింతలలోని రెండు విద్యుత్ పీ దర్లకు అనుసంధానం చేశామన్నారు. గురువారం రాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.5633 ఎంయూల విద్యుత్ తయారైందని చెప్పారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 2 మీటర్లు, ఒక గేటును మీటర మేర ఎత్తి 34,046 క్యూసెక్కులు, టీఆర్‌సీ ద్వారా 8,475, పులిచింతలకు 42,521 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్ నుంచి 50507 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద దిగువకు 53400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 60,917 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2823 , పశ్చిమ డెల్టాకు 4513, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల


సాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు సాగర్ ప్రాజెక్ట్‌కు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ అధికారులు రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5367, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307 , రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,200, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 67,674 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 67,674 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 45.10 టీఎంసీలు..

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 45.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ఎగువ నుంచి 49,887 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, గేట్ల ద్వారా 41,786 క్యూసెక్కుల నీరు, మొత్తం 58,786 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

బగళాముఖి సన్నిధిలో సింగర్ మనో దంపతులు


మనో దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

పిట్టలవానిపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గాయకుడు సింగర్ మనో దంపతులు బగళాముఖి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన పెద్దకుమారుడు షాకీర్‌బాబు హీరోగా, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన వటాక్కాశ్ తమిళ సినిమా ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్ర ఘన విజయం సాధించాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. సింగర్ మనో అమ్మవారికి అనేక స్తోత్రాలు పాడారని.. అందులో శ్రీబగళాముఖి భజే అనే స్తోత్రం బహుళ ప్రాచుర్యం పొందిందన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టెట్‌పై సుప్రీంలో రివ్యూ పిటిషన్: మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు తెలిపారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో అశోక్‌బాబును ఎన్‌టీఏ నాయకులు కలిశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తుందని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎస్.భాస్కరరావు, కోశాధికారి కె.నాగేశు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల- వాడరేవు హైవేతో కొత్త సమస్యలు


చిలకలూరిపేట-చీరాల మధ్య పూర్తయిన హైవే

చిలకలూరిపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల - వాడరేవు 167ఏ హైవే చిలకలూరిపేట, వాడరేవు మధ్య దాదాపుగా పూర్తి కావచ్చింది. ఈ రహదారి కారణంగా ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారి నిర్మాణం అనంతరం పలు లోపాలు బయట పడుతున్నాయి. ఇటీవల తుఫాన్ కారణంగా.. కురిసిన భా రీ వర్షాలకు చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని కొన్ని ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. పసుమర్రులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, పక్కనే ఉన్న ఎస్టీ కాలనీలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో చిలకలూరిపేట చీరాల పాత హైవేకు గండి కొట్టి.. వరద నీటిని స్థానికులు బయటకు పంపారు. ఈ ప్రాంతానికి వచ్చిన చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హైవే అథారిటీ అధికారులకు ఫోన్లో.. మాట్లాడారు. దీంతో వెంటనే వారు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ కొన్ని లోపాలు ఉన్నాయని వారు అంగీకరించి త్వరలోనే పరిస్థితులు చక్క దిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ మార్గంలో పసుమర్రు వద్ద రోడ్డు దాటి వింజనంపాడు, అనంతవరం వెళ్లే జంక్షన్లలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం వింజనంపాడు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. వింజనంపాడు, అనంతవరం క్రాస్ రోడ్ల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆకట్టుకున్న వేషధారణ
నే నాట్యమాడితే..
నే ముత్యాల ముగ్గేస్తే..
నే రంగులు అద్దితే..
నాట్య మయూరిలా..

కళల విందుగా.. బాలల పండుగ!

- ఘనంగా ప్రారంభమైన వీవీఐటీయూ బాలోత్సవ్-2025
- అతిథుల చేతుల మీదగా పోటీలు ఆరంభం
- అబ్బురపరిచిన విద్యార్థుల ప్రదర్శనలు
- చిన్నారుల నైపుణ్యం వెలుగులోకి: ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్
- ఉన్నత శిఖరాలకు దోహదం: ఆచార్య మధుమూర్తి
- ఆనందోత్సాహాల నడుమ వీవీఐటీ వర్సిటీ ప్రాంగణం


గంట కొట్టి పోటీలను ప్రారంభిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు


ప్రదర్శనలను వీక్షిస్తున్న కళాశాల విద్యార్థులు

పెదకాకాని, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్-2025 వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా శుక్రవారం ప్రారంభించారు. పదిహేను వేలకు పైగా పోటీదారులతో 20 అంశాలు 61 విభాగాల్లో మూడు రోజుల పాటు 32 వేదికలపై వేడుకగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, ఏపీఎస్ఆర్‌టీ అధ్యక్షుడు డాక్టర్ కె. రవికుమార్ వేమూరి, ఈనాడు సంపాదకుడు ఎం.నాగేశ్వరరావు, వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ విశిష్ట అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. వాసిరెడ్డి విద్యాసాగర్, మండలి బుద్ధ ప్రసాద్, అతిథులు గంట మోగించి పోటీలను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవ్ ద్వారా చిన్నారులలో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్ కృషిని కొనియాడారు. జాతి గొప్పతనాన్ని, భాష ప్రాభవాన్ని, సాంస్కృతిక విశిష్టతను భావితరాల ద్వారా చిరకాలం నిలిచిపోవాలన్న సంకల్పంతో ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళల పట్ల అభిరుచి, ఆసక్తి గల చిన్నారులను ప్రోత్సహిస్తే జాతి సంస్కృతికి ఎటువంటి ఢోకా ఉండదన్నారు. దేశం గర్వించదగ్గ అద్భుతమైన కళాకారులుగా బాలోత్సవ్‌లో పాల్గొనే చిన్నారులు రూపాంతరం చెందుతారన్న అభిప్రాయం వ్యక్తపరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె. మధుమూర్తి మాట్లాడుతూ చదువుతోపాటు ఉన్నత శిఖరాలు చేర్చడానికి కళలు దోహదపడతాయన్నారు. బాలోత్సవ్ వంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులలో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. డాక్టర్ కె.రవికుమార్ వేమూరి మాట్లాడుతూ చిన్న వయస్సులో కళల పట్ల ఆసక్తి కలిగి ఉండటం మంచిదని, ఈతరం చిన్నారులు అన్ని రంగాలలో వారి ప్రతిభను ప్రదర్శించడం మంచి పరిణామమని అన్నారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. మూడు రోజులు ఉత్సాహంగా పోటీల్లో విద్యార్థులు పాల్గొని మధురానుభూతులు పొందాలని అన్నారు. ఈనాడు సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలోత్సవం అంటే చిన్నారులకు వేడుకని, గెలుపు ఓటములకన్న ఈ వేడుకలో పాల్గొనడం ముఖ్యమన్నారు. ఈ అనుభూతులు చిన్నారులకు జీవితమంతా గుర్తుంటాయని పేర్కొన్నారు. పిల్లలు దేశ సంపద అని మంచి పిల్లలతో మంచి దేశం తయారవుతుందన్నారు.

పోటాపోటీగా విద్యార్థులు ప్రదర్శనలు


శ్రద్ధగా చిత్రాలను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

బాలోత్సవంలో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు చేస్తున్నారు. సందర్శకులను అబ్బురు పరిచే విధంగా ప్రతిభను చాటుతున్నారు. యూనివర్సిటీ ప్రాంగణమంతా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులతో కళకళలాడుతోంది.


ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య రూపకం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు
డెప్యుటేషన్‌పై నలుగురు వైద్యులు

వినుకొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు డెప్యుటేషన్‌పై నలుగురు వైద్యులను నియమించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న నలుగురు మహిళా వైద్యులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కలెక్టర్ సూచన మేరకు సెకడరీ హెల్త్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈపూరులో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రజాక్ (ఎనస్తీషియా) నరసరావుపేట నుంచి రాజశేఖర్ (ఎంబీబీఎస్), సౌజన్య (గైనకాలజిస్ట్), నత్తెనపల్లి నుంచి నవ్య (ఎంబీబీఎస్)లను కేటాయించారు.

స్వాతి షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

నరసరావుపేట లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట సెంటర్‌లోని స్వాతి షాపింగ్ మాల్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడో అంతస్తులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల విలువైన ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. నాలుగు అంతస్తులుగా ఉన్న మాల్‌లో మూడో అంతస్తులో ఉదయం 9 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగి దట్టంగా పొగ అలుముకుంది. రెండో పట్టణ సీఐ చలంచర్ల ప్రభాకరరావు ఎస్‌ఐలు హరిబాబు, అశోక్‌బాబు, లేఖప్రియాంక సిబ్బంది, అగ్నిమాపకశాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. మూడో అంతస్తు గోడలను ఎక్స్‌కవేటర్‌తో పగలగొట్టి మంటలను అదుపుచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. షాపింగ్ మాల్ నిర్మాణంలో నిబంధనలు పాటించకపోయినా అనుమతులివ్వటంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

బొప్పూడి వద్ద ఏడుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలోని ఎన్‌హెచ్16 జాతీయ రహదారి సమీపంలో పేకాట (కోత ముక్క) ఆట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను శుక్రవారం చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ జి.అనీల్‌కుమార్ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.17,550లు స్వాధీనం చేసుకున్నారు.

చిలకలూరిపేట రజక కాలనీలో దొంగతనం

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక కాలనీ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న ప్రభాకర్ అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. ఇంటిలోని వారు వేరే ఊరు వెళ్ళిన సమయంలో దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి మూడు సవర్ల బంగారు గొలుసు చోరీ చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అర్బన్ ఎస్‌ఐ రహంతుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కమ్మజన కార్తీక వనసమారాధన కార్యక్రమం 9వ తేదీన నరసరావుపేట రావిపాడు రోడ్డులోని కమ్మ బాలుర హాస్టల్‌లో జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ప్రధాన సెంటర్ల నుంచి ఉచిత బస్ సౌకర్యం ఉందన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

● ఈపూరు: పలు గ్రామాల్లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గాంధీ తెలిపారు.

● నరసరావుపేట రూరల్: పట్టణంలోని కోటబజార్‌లోని వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామివారి దేవాలయ నిర్మాణానికి ఎస్ఎస్ఎన్ కళాశాల విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసహనుమంతరావు కుమార్తె వాసంతి రూ.3,00,001, కొంపల్లి హరీష్, హేమలక్ష్మి రూ.25116, గుంటూరు అప్పారావు, రాజ్యలక్ష్మి రూ.25116ను దేవస్థాన కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

● నరసరావుపేట కల్చరల్: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై లబ్ధిదారులకు శుక్రవారం ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెస్ఎంఈ డెవలెప్మెంట్ ఆఫీస్, విశాఖపట్టణం ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హైస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎంఈ ఏడీ వీరయ్య లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

● శావల్యాపురం: మండలంలోని శ్యావల్యాపురం పాఠశాలలకు ఇనుప బీరువాని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అందజేసింది. అనంతరం దాత నాగేంద్రుడు మాస్టారును ఘనంగా సత్కరించారు.

● వినుకొండ: పట్టణంలోని పోలేరమ్మ దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా శుక్రవారం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో రుద్ర హోమం, చండీ హోమం, నవగ్రహ హోమం నిర్వహించారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని 52 ఎకరాల సముదాయం టిడ్కో గృహాల వద్ద ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగా ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం నుంచి టిడ్కో గృహాలకు ఆటో సౌకర్యం ఏర్పడిందన్నారు.

● శావల్యాపురం: స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో మే టీచ్ టూల్ ప్రోగ్రాంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, హెచ్ఎంలు విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని గోనెపూడిలో వరి పంటలను ఏడీఏ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

● బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొల్లాపల్లి ఎస్‌ఐ సయ్యద్ సమీర్ బాషా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా వందేమాతర గీతం స్మారకోత్సవం

● ముఖ్యఅతిథి కలెక్టర్ కృతికా శుక్లా




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు, భారీ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం రచించి నేటికి 150 ఏళ్ళు అయిన సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన వేడుకలు ఎస్ఎస్ఎన్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా విద్యార్థులతో వందేమాతరం గీతాలాపన చేయించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐక్యత యాత్రను కలెక్టర్ కృతికా శుక్లా, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బిట్రా వెంకటశివన్నారాయణ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో మధులత కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం స్మారకోత్సవంలో ప్రిన్సిపాల్ జినాగమల్లేశ్వరరావు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ కృతికాశుక్లా పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బిక్కృష్ణారావు ఆదేశాల మేరకు శుక్రవారం వందేమాతర గీతాన్ని ఆలపించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిబాబు, డీసీఆర్బీ, ఐటీ విభాగం, పరిపాలన విభాగ అధికారులు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, ఆర్ఐలు రాజా, కృష్ణ, గోపీనాథ్, యువరాజ్ ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో జాతీయ గీతం స్మారకోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కరీముల్లా, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు సమద్ ఖాన్, ఎం.రవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం స్మారకోత్సవంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, సునీల్, ఎం.రాజేష్‌బాబు, శ్రీధర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న పోలీస్ సిబ్బంది

● నరసరావుపేట కల్చరల్: పట్టణంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతరం 150 సంవత్సరాల వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఐ.శ్రీధర్, ఏఏవో కె.అనిల్‌కుమార్, ఆర్అండ్‌డీ డీన్ ఎస్‌వీఎన్ శ్రీనివాసు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక ఇంటర్నేషనల్ డిల్లి పబ్లిక్ స్కూలులో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్‌డాక్టర్ నాగోతు ప్రకాషరావు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగోతు సబితా, ప్రిన్సిపాల్ రేఖా పూలేకర్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఎం.భూపతి, అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రవినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సంపూర్ణ వందేమాతరం గీతాలాపన సామూహికంగా చేశారు.

● యడ్లపాడు: మండలంలోని బోయపాలెం బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో, సెయింట్ ఆన్స్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వందేమాతర గీతంను ఆలపించారు.

● నూజెండ్ల: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో జరిగిన వందేమాతరం కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి పాల్గొన్నారు.

● శావల్యాపురం: వందేమాతర గీతాన్ని రచించి 150ఏళ్ళు పూర్తయిన సందర్భంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శుక్రవారం వందేమాతర గీతం స్మారకోత్సవాన్ని నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లోకేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, జడ్పీ పాఠశాలల్లో ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, హెచ్ఎంలు విజయలక్ష్మి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమస్యలను పరిష్కరించాలి

● ప్రజాదర్బార్‌లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అధికారులు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణం కొత్తపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జీవీ ఆంజనేయులు అర్జీలను స్వీకరించారు. పెన్షన్లు, మున్సిపల్, రెవెన్యూ, తాగునీటి సహా వివిధ సమస్యలపై 60 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అధికారులు జనాలతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పుష్పయాగం

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీఅలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాసంను పురస్కరించుకొని శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకం అనంతర హోమం తదుపరి స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణాహుతితో మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి సమర్పించే పూల బుట్టలతో దేవస్థానం చుట్టూ ప్రదర్శనలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలకు పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, దేవస్థాన అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, సెక్రెటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ కాళ్ళ రామకోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డి.వెంకటప్రసాదరావు, అన్నా వీరబ్రహ్మం, కె.పెద రాములు, ఎ.చిన్నసుబ్బారావు, ఆర్.కోటేశ్వరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.నాగేశ్వరరావు, ఎస్.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి సమర్పించే పూలబుట్టలతో దేవస్థానం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రణాళికాబద్ధంగా కూటమి ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



పట్టణంలోని శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని వివిధ మతాలకు చెందిన శ్మశాన వాటికలను పరిశీలించారు. గుంటూరు రోడ్డులో ఉన్న స్వర్గపురి, రావిపాడు రోడ్డులోని స్వర్గపురి-2, ముస్లిం కబరస్థాన్, క్రిస్టియన్ సమాధుల తోటలను సందర్శించి, అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. క్రిస్టియన్ సమాధుల తోటలో తుఫాను కారణంగా వర్షపు నీరు సమాధుల్లోకి చేరినట్లు గుర్తించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతి పత్రాలు స్వయంగా డాక్టర్ అరవిందబాబు స్వీకరించి ఎమ్మెల్యే, సంబంధిత శాఖ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలకు ఆదేశించారు.

దివ్యాంగునికి సుబ్బరాయ గుప్తా రూ.20 వేలు వితరణ



సంతమాగులూరు వెంకటేశ్వర్లుకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా దివ్యాంగునికి రూ.20వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు. రైల్వే ప్రమాదంలో సంతమాగులూరు వెంకటేశ్వర్లు రెండు కాళ్ళు పోగొట్టుకున్నారు. నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతులమీదుగా రూ.20వేలు అందజేశారు.

నేషనల్ క్యాన్సర్ అవగాహన దినోత్సవ ర్యాలీ

నరసరావుపేట రూరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం ఆధ్వర్యంలో నరసరావుపేటలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని. ఇందుకోసం రకరకాల స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమ కుమార్, డీఐవో డాక్టర్ రాంబాబు, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక ఎంఏఎం కళాశాలలో జాతీయ కాన్సర్ అవగాహన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ చెరుకూరి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్లు చేసిన సామాజికసేవా కార్యక్రమాలను అభినందించారు.

టీడీపీ మండల పార్టీ అధ్యక్షుల నియామకం

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వినుకొండ పట్టణంతో పాటు, ఐదు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా పార్టీ అధిష్ఠానం నియమించినట్లు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. బొల్లాపల్లి మండల పార్టీ అధ్యక్షుడిగా మేరాజోత్ హనుమాన్ నాయక్, ఈపూరుకు రాపర్ల మురళి, శావల్యాపురంకు గుంటూరు సాంబయ్య, వినుకొండ రూరల్‌కు కర్నాటి వెంకటరెడ్డి, వినుకొండ పట్టణానికి బొంకూరి రోశయ్య, నూజెండ్ల మండలం గంగినేని రాధాకృష్ణ (బాబు) లను మండల పార్టీ అధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు.

పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీ

యడ్లపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కారుచోలలోని జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్‌ను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు స్లిప్ టెస్ట్‌ను నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి 1, 2 తరగతి విద్యార్థుల భాషా, గణిత నైపుణ్యాలను పరిశీలించారు. చిన్నారుల సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఉపాధ్యాయులకు మార్గనిర్దేశనం చేశారు. అక్కడి నుంచి పాఠశాల పరిసరాలను పరిశీలించి అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపుదలపై చర్చించారు.

బీపీసీఎల్ అవుట్‌లెట్ ప్రారంభం

● పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి

యడ్లపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం బోయపాలెం జాతీయరహదారి పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన స్వర్ణముఖి పెట్రోలియం (బీపీసీఎల్) అవుట్‌లెట్ శుక్రవారం ప్రారంభమైంది. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొని పెట్రోలు పంపులను ప్రారంభించారు. కార్యక్రమంలో బంకు యజమానులు భారతీరాజా, శివనాగమోహనరావు, వెంకటాచలం, గంగాధరరావు, రావూరి నాగేశ్వరరావు, వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, పల్నాడు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.వీరారెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, తేళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

శావల్యాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2026-27 ఆర్థికసంవత్సరంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మండలంలోని బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మాట్లాడుతూ బొందిలిపాలెంలో గుర్తించిన 35పనులు, మతుకుమల్లిలో గుర్తించిన 76పనులను గ్రామసభల్లో ప్రజలకు వివరించి పంచాయతీతీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యలగాల బసవయ్య, చింతా విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అరుణభారతి, జనసేన మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్ టీడీపీ నాయకులు సోమేపల్లి వెంకట్రావు, పొనుగోటి వెంకట్రావు, పసుమర్తి బసవయ్య, జేఈ సుధాకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు, ప్రభుత్వానికి
మంచిపేరు రాకూడదనే జగన్ విమర్శలు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మంచిపేరు రాకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి విషయానికి జగన్ అర్థంపర్థం లేని విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం పేర్కొన్నారు. జగన్ ఎప్పటికప్పుడు కుయుక్తులు పన్నుతూ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నాడని విమర్శించారు. మొక్కుబడిగా చేసిన 'అన్నదాతలకు అండగా' షో విఫలం అయిందని, పెయిడ్ ఆర్టిస్టుల ప్రదర్శన నీరుగారిందని వివరించారు. పార్టీ కార్యక్రమాల గురించి అనుకూల మీడియాలో గొప్పలు చెప్పుకోవడం తప్ప, అసెంబ్లీకి వచ్చి నోరు తెరిచే ధైర్యం జగన్‌కు లేదని ప్రజలకు అర్థమైందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదని జగన్ తన అవినీతి మీడియాలో, పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని పేర్కొన్నారు.

వైసీపీకి కట్టుబడివారిపాలెం ముఖ్యనేత రాజీనామా

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెంకు చెందిన ముత్యాల రామారావు అనే ముఖ్య వైసీపీ నేత ఆ పార్టీకి రాజీనామా చేశారు. మండల వైసీపీ అధ్యక్షుడు దేవినేని శంకరరావుకు ఆయన తన రాజీనామా లేఖను శుక్రవారం అందచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్లమైన తమకు పార్టీ నాయకులు ప్రవర్తించే తీరు నచ్చడంలేదని, పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో పాటు అసలు నాయకులు ఎవరో తెలియక తలలు పట్టుకునే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.



జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న లగడపాటి సుబ్బారావు

మెల్‌బోర్న్‌లో ఘనంగా లగడపాటి సుబ్బారావు జన్మదినం

నూజెండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల గ్రామానికి చెందిన మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు జన్మదిన వేడుకలు మెల్‌బోర్న్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్ళిన మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికి పార్టీ కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న లగడపాటి సుబ్బారావును నృత్య బృందం, ఆస్ట్రేలియా టీడీపీ నాయకులు జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

కాపు కల్యాణ మండపం డైనింగ్ హాల్‌కు భూమి పూజ

● రూ.10 లక్షల విరాళం ప్రకటించిన బైరా దిలీప్

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణారెడ్డి డొంక రోడ్డులో నిర్మిస్తున్న తెలగ, బలిజ, కాపు కల్యాణ మండపం డైనింగ్ హాల్ భూమి పూజ కార్యక్రమాన్ని శుక్రవారం కాపు నాయకులు, పెద్దల సమక్షంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పట్టణానికి చెందిన ఐటీ ప్రముఖులు బైరా దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు. డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.10లక్షల విరాళాన్ని ఆయన ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో చెన్నకేశవుల రమేష్‌బాబు, తోట రాము, కాయల తేజోమూర్తి, తోట రాజారమేష్, మండలనేని చరణ్ తేజ, మల్లెల శివనాగేశ్వరావు, పరాంకుశం శ్రీనివాసరావు సుబ్రహ్మణ్యం, తోట బ్రహ్మస్వాములు, పొన్నం చంద్రశేఖర్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.